క్లుప్తంగా

నేడు మంత్రి పర్యటన

హుస్నాబాద్: పట్టణంలో బుధవారం జరిగే వివిధ కార్యక్రమాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొననున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆర్డీఓ, తహసీల్దార్, ఎంపీడీఓలతో సమీక్షా సమావేశం, సాయంత్రం 4 గంటలకు హుస్నాబాద్ ఆర్టీసీ డిపోకు కేటాయించిన రెండు కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సులను ప్రారంభించనున్నారు. 4.30 గంటలకు తిరుమల గార్డెన్‌లో హుస్నాబాద్ ప్రెస్‌క్లబ్ (ఐజేయూ), శ్రీనిధి ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో మంగళారపు లక్ష్మణ్ రచించిన మాయనిగాయాల నెత్తుటి చరిత్ర పుస్తక ఆవిష్కరణలో మంత్రి పాల్గొంటారని క్యాంపు కార్యాలయ సిబ్బంది తెలిపారు.

సమావేశానికి ఆహ్వానం



మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కాంగ్రెస్ నాయకులు

ములుగు(గజ్వేల్): మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్త ఆధ్వర్యంలో కలిసినట్లు ములుగు మండల నాయకులు మంగళవారం తెలిపారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో మంత్రిని కలిసి పార్టీ మండల స్థాయి కార్యకర్తల సమావేశానికి హాజరుకావాలని కోరినట్లు చెప్పారు. మంత్రిని కలిసినవారిలో ములుగు మాజీ ఎంపీపీ వెంకట్రాంరెడ్డి, నాయకులు బుజేందర్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, ఏకాంబర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్చకరత్న నేషనల్ అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న రామాచారి

కోహెడరూరల్(హుస్నాబాద్): అర్చకరత్న నేషనల్ అవార్డుకు మండలంలోని రాంచంద్రపూర్ గ్రామానికి చెందిన శ్రీసీతారామ ఆంజనేయ ఆలయ అర్చకుడు శ్రీ రంగం రామాచారి ఎంపికయ్యారు. అవార్డును నేషనల్ కమిటీ చైర్మన్ బీఎస్‌పీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా రామాచారి మాట్లాడుతూ తనకు ప్రదానం చేసిన అవార్డును రాంచంద్రపూర్ గ్రామ ప్రజలకు, రామభక్తులకు అంకితం చేస్తున్నానన్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



పిట్టలగూడెంలో నల్లాను ప్రారంభిస్తున్న సర్పంచ్ రవీందర్ రెడ్డి

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని ధర్మారం శివారు పిట్టలగూడెం తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపినట్లు సర్పంచ్ ఊట్ల రవీందర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పిట్టలగూడెంలో ఏర్పాటు చేసిన నల్లాలను ప్రారంభించారు. రూ.13 లక్షల వ్యయంతో మిషన్ భగీరథ ట్యాంక్ నిర్మించామని, అయితే ట్యాంక్‌కు నీరు సరఫరా కాకపోవడంతో గ్రామ పంచాయతీ బోరుమోటర్ ద్వారా ట్యాంకు నింపి సమస్యను పరిష్కారించామన్నారు. సమస్య పరిష్కరించినందుకు పిట్టలగూడెం వాసులు కృతజ్ఞులు తెలిపారు.

యువత క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులతో సింగిల్ విండో చైర్మన్ బొల్లిశెట్టి శివయ్య

హుస్నాబాద్‌రూరల్: గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలని సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య అన్నారు. మంగళవారం కూచనపెల్లి గ్రామంలో మడప రాంరెడ్డి ట్రస్టు డివిజన్ స్థాయి క్రికెట్ టోర్నీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చదువుతోపాటు క్రీడల్లోరాణిస్తే ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. సరైన వసతులు లేక యువత క్రీడలకు దూరంగా ఉంటున్నారని, గ్రామీణ యువత కోసం క్రీడా సౌకర్యాలు కల్పించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మడప జయపాల్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

హుస్నాబాద్ ఎంవీఐగా జనార్ధన్ రెడ్డి

హుస్నాబాద్: హుస్నాబాద్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా టి.జనార్దన్ రెడ్డిని నియమిస్తూ తెలంగాణ ట్రాన్స్‌పోర్టు ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాస రాజు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశా రు. ఇప్పటి వరకు హుజురాబాద్ ఎంవీఐ ఈశ్వర్ సింగ్ హుస్నాబాద్ ఇన్‌చార్జిగా పనిచేశారు.

పుడమి పులకించేలా... పైరు చిగురించేలా



వరిగట్టుపై భూ తల్లి, లింగాలకు పూజ చేసిన రైతులు



చిగురిస్తున్న వరి మొలకలు

మిరుదొడ్డి(దుబ్బాక): యాసంగి సాగు చల్లగా సాగి నవధాన్యాలతో సిరులు కురిపించాలని కోరుతూ పుడమి తల్లిని రైతులు ఆరాధిస్తున్నారు. యాసంగి ప్రత్యేకతను చాటుతూ భూ తల్లికి పూజలు చేసి సాగుకు శ్రీకారం చుడుతున్నారు. వరి నారు పోసే ముందు పొలంలో గట్టుపై 'ఉడుగు' చెట్టు కొమ్మలను బంతి పూలతో అలంకరించి భూ తల్లిగా కొలుస్తున్నారు. ఐదు పలుగు రాళ్ళను లింగాలుగా భావించి సున్నం, పసుపు, కుంకుమతో పూజలు చేసి వరుసగా వరి విత్తనాలను పెట్టి పెరుగన్నంతో నైవేద్యం సమర్పిస్తున్నారు. భూ తల్లి తమను చల్లగా చూడాలని మొక్కుకొని వరి నారును పొలంలో చల్లుతున్నారు. అనాదిగా వస్తున్న యాసంగి ఆచారాన్ని పాటిస్తున్నామని మండల పరిధిలోని రైతులు తెలిపారు.

మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాలి

జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ



కుట్టుమిషన్ అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

చిన్నకోదూరు(సిద్దిపేట): మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. మంగళవారం చిన్నకోడూరులో న్యాక్ ఆధ్వర్యంలో 90 రోజులపాటు కుట్టుశిక్షణ పొందిన మహిళలకు కుట్టు మిషన్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందించే రుణాలతో స్వయం ఉపాధి బాటలు వేసుకుంటూ ఆర్థికంగా ఎదగాలన్నారు. ప్రైవేటు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని మోసపోవద్దన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, స్టీల్ వస్తువుల వాడకం పెంచాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి, సర్పంచ్ కాముని ఉమేష్ చంద్ర, ఏపీఎం మహిపాల్, సీసీలు శ్రీనివాస్ రెడ్డి, కొమురయ్య, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆటవస్తువుల అందజేత

మద్దూరు(హుస్నాబాద్): మండల పరిధిలోని గాగిళ్ళాపూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన తౌటి భూమయ్య, జినేష్, మోహిత్‌లు మంగళవారం రూ.50 వేల విలువైన మైక్‌సిస్టం, ఆటవస్తువులు బహూకరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గుడిసె అంజయ్య, సర్పంచ్ బొల్లు కృష్ణవేణి, ఎస్‌ఎంసీ చైర్మన్ తౌటి సంధ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

100కు డయల్ చేయండి

దుబ్బాకటౌన్: బాలికలు, మహిళలకు ఏదైన ఆపద వస్తే వెంటనే 100కు ఫోన్‌చేస్తే తగిన సాయం అందించడం జరుగుతుందని దుబ్బాక సీఐ మున్నూరు కృష్ణ అన్నారు. మంగళవారం భూంపల్లి-అక్బర్‌పేట మండలం చిట్టాపూర్ ప్రభుత్వ హైస్కూల్‌లో బాలికలకు మహిళల రక్షణ చట్టాలు, సైబర్ నేరాలు, గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్ అంశాలపై సీపీ ఆదేశాల మేరకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భూంపల్లి ఎస్ఐ భువనేశ్వర్ రావు, హెచ్‌ఎం ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వరంగల్ ఎంపీ అభ్యర్థిగా అవకాశం కల్పించండి

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీకి పరమేశ్వర్ వినతి



కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని కలిసిన పరమేశ్వర్

చేర్యాల(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ తరఫున వరంగల్ ఎంపీ స్థానానికి పోటీచేసే అవకాశం తనకు ఇవ్వాలని కోరుతూ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీకి వినతి పత్రం అందజేసినట్లు చేర్యాల మాజీ ఎంపీపీ డాక్టర్ రాముగళ్ల పరమేశ్వర్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసినట్లు చెప్పారు. 2009, 2014లో వరంగల్ ఎంపీగా పోటీచేసి స్వల్పఓట్లతో ఓడిపోయానన్నారు. రెండు పర్యాయాలు చేర్యాల ఎంపీపీగా పనిచేసిన తనకు ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాలపై పూర్తి అవగాహన ఉందన్నారు.

రేపటి నుంచి ఉర్సు ఉత్సవాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఖాజా మహమ్మద్ హకీం షరీఫ్ చిస్తీ తదితరులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని ముర్షద్ గడ్డ దర్గా ఉర్సు ఉత్సవాలు గురువారం నుంచి శనివారం వరకు నిర్వహించనున్నట్లు దర్గా పీఠాధిపతి ఖాజా మహమ్మద్ హకీం షరీఫ్ చిస్తీ తెలిపారు. మంగళవారం ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు మత సామరస్యానికి ప్రతీకగా ఈ దర్గా విరాజిల్లుతోందన్నారు. ఉత్సవాలకు సిద్దిపేట నుండే కాకుండా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తారన్నారు. 11వ తేదీన గంధం ఆరాధన, జ్ఞానమత ఖవ్వాలి, 12న దీపాలంకరణోత్సవం, 13న పవిత్ర ఖురాన్ పఠనం, వేదాంత హారతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

గోదావరి జలాల విడుదలకు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతులు

సిద్దిపేటజోన్: ఆరుతడి పంటలు, వరి సాగు కోసం ప్రభుత్వం రంగనాయక సాగర్ ద్వారా గోదావరి జలాలను విడుదల చేసి ఆదుకోవాలని చిన్నకోడూర్ రైతులు మంగళవారం కలెక్టర్ ప్రశాంత్ పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. చిన్నకోడూర్ మండలం మాటిండ్ల, మెట్‌పల్లి, సలేంద్రి, కమ్మర్లపల్లి, మైలారం, మాచపూర్ గ్రామాల రైతులు విపంచి ఆడిటోరియంలో కలెక్టర్, జెడ్పీచైర్మన్‌ను కలిసి మొర పెట్టుకున్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో భూగర్భ జలాలు అడుగంటి, బావుల్లో, బోర్లలో నీరు అడుగంటి పోయాయని, సాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని వివరించారు.

గడప గడపకు అక్షింతల పంపిణీ



వర్గల్‌లో అక్షింతల కలశాలను ఊరేగిస్తున్న భక్తులు

బెజ్జంకి(సిద్దిపేట): అయోధ్య రామమందిర అక్షింతలను మంగళవారం మండలంలోని దాచారంలో ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. అక్షింతల కలశాలకు మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ, బీజేపీ మండల అధ్యక్షుడు కొలిపాక రాజు, దళిత మోర్చా ఉపాధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

వర్గల్(గజ్వేల్): అయోధ్య శ్రీసీతారాముల పూజిత అక్షింతలను మంగళవారం మండల కేంద్రం వర్గల్‌లో పంపిణీ చేశారు. స్థానిక భక్తజనపరివారం, ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. శ్రీవేణుగోపాలస్వామి ఆలయం నుంచి అక్షింతల కలశపాత్రను ఊరేగింపుగా తీసుకెళ్లి ఇంటింటికి అక్షింతలను అందజేశారు.

నంగునూరు(సిద్దిపేట): అయోధ్య నుంచి వచ్చిన శ్రీరామ పూజిత అక్షింతలను మంగళవారం పలు గ్రామాల్లో పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లోని హనుమాన్ దేవాలయాల్లో అక్షింతలకు పూజలు చేశారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

1 నుంచి 15వ తేదీ వరకు ..

చిన్నకోదూరు(సిద్దిపేట): అయోధ్యలో బాలరాముడి వద్ద పూజించిన అక్షింతల వితరణ కార్యక్రమం ముమ్మరంగా సాగుతుంది. ఈనెల 1 నుంచి 15వ తేదీ వరకు ఇంటింటికి తిరిగి అక్షింతలు పంపిణీ చేస్తున్నారు. మంగళవారం మండల పరిధిలోని గంగాపూర్, మైలారం, అనంతసాగర్, గోనెపల్లి గ్రామాల్లో అక్షింతల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి బుస్స నరేష్, ప్రజా ప్రతినిధులు, రామభక్తులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరం విజయవంతం



ఉచితంగా మందులు పంపిణీచేస్తున్న డాక్టర్ మోహన్‌లాల్

వర్గల్(గజ్వేల్): పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని మాదారంలో నిర్వహించిన పశువైద్యశిబిరం విజయవంతమైంది. వేలూరు పశువైద్యాధికారి డాక్టర్ మోహన్‌లాల్ పర్యవేక్షణలో గోపాలమిత్రలు శిబిరంలో భాగస్వాములయ్యారు. పాడిపశువులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. 14 పశువులకు గర్భనిర్ధారణ పరీక్షలు, మూడింటికి కృత్రిమ గర్భధారణ చేశారు. 12 పశువులకు సాధారణ చికిత్సచేసి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. 23 దూడలకు నట్టల నివారణ మందు అందజేశారు. పశువులలో గర్భకోశ వ్యాధి, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను పశువైద్యాధికారి డాక్టర్ మోహన్‌లాల్ పాడిరైతులకు వివరించారు. రైతులు గోపాల మిత్రల సేవలను, ఉచిత పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రామచంద్రం, జేవీఓ లక్ష్మణ్, గోపాలమిత్ర సూపర్ వైజర్ భాస్కర్‌గౌడ్, గోపాలమిత్రలు శ్రీరాములు, ఆంజనేయులు, సురేష్ పాల్గొన్నారు.

సర్పంచ్‌ల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్లాలి

చందాపూర్ సర్పంచ్ బొడ్డు నర్సింహులు



కోదండరాంతో చందాపూర్ సర్పంచ్ నర్సింహులు

తొగుట(దుబ్బాక): సర్పంచ్‌ల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూడాలని టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాంను కోరినట్లు మండలంలోని చందాపూర్ సర్పంచ్ బొడ్డు నర్సింహులు మంగళవారం తెలిపారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో ప్రత్యేకంగా కలిసి తమ సమస్యలు వివరించినట్లు చెప్పారు. సర్పంచ్‌ల పదవీకాల పరిమితి ముగిసిన తర్వాత ఎన్నికలు నిర్వహించాలని, ప్రత్యేకాధికారుల పాలనవద్దని అలా కుదరని పక్షంలో పదవీకాలాన్ని పొడిగించాలని కోరినట్లు తెలిపారు. కరోనా సంక్షోభంలో సర్పంచ్‌లు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని వివరించానన్నారు. గత ప్రభుత్వం 2022 నుంచి గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు చేయలేదని ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసినా నిధులు మంజూరు చేయలేదని ఆరోపించారు. చేసిన పనులకు బిల్లులు రాక పలువురు సర్పంచ్‌లు ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు ఆయన దృష్టికి తీసుకుపోయామన్నారు. పెండింగ్ బిల్లులను ప్రభుత్వం మంజూరు చేసేలా కృషిచేయాలని కోరామని, సానుకూలంగా స్పందించిన కోదండరాం సీఎం దృష్టికి తీసుకుపోతామని హామీఇచ్చారని తెలిపారు.

ఫాతిమాకు ఘన నివాళి



హుస్నాబాద్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

హుస్నాబాద్: భారత దేశ తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ 193వ జయంతిని ప్రజా సంఘాల నాయకులు మంగళవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. సావిత్రి బాయి పూలే సమకాలికురాలు ఫాతిమా షేక్ అణగారిన పిల్లలకు విద్యను అందించారన్నారు. చరిత్రను ఇప్పటి విద్యావంతులు వెలికి తీస్తున్నారని తెలిపారు. ఫాతిమా షేక్ చరిత్రను అన్ని భాషల్లో ప్రవేశపెట్టాలన్నారు. యువత ఆమె బాటలో నడిచినప్పుడే నిజమైన నివాళి అర్పించినట్లవుతుందన్నారు. కార్యక్రమంలో మేకల వీరన్న యాదవ్, మాజీ సర్పంచ్ కేడం లింగమూర్తి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



అనంతరావుపల్లిలో ఫాతిమా షేక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

ఫాతిమా షేక్ సేవలు మరువలేనివి

గజ్వేల్‌రూరల్: తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయిపూలేకు అండగా నిలిచిన ఫాతిమా షేక్ సేవలు మరువలేనివని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి అన్నారు. ఫాతిమాషేక్ జయంతి సందర్భంగా మండల పరిధిలోని అనంతరావుపల్లిలో మంగళవారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఫాతిమా షేక్ 19వ శతాబ్దంలో బాలికల విద్యకోసం కృషి చేశారన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు సుధాకర్, నర్సింలు, సుదర్శన్, రవి, నర్సవ్వ, యాదవ్వ, బాలవ్వ తదితరులు పాల్గొన్నారు.

వనభోజనాల్లో ఆర్టీసీ ఉద్యోగులు



వనభోజన కార్యక్రమంలో పాల్గొన్న ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది

గజ్వేల్‌రూరల్: ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సూచనల మేరకు మంగళవారం జీపీపీ(గజ్వేల్-ప్రజ్ఞాపూర్) ఆర్టీసీ డిపో ఉద్యోగులు, సిబ్బంది వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజ్ఞాపూర్‌లోని డిపో ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మెదక్ రీజియన్ ఆఫీసర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ సిబ్బంది సేవలు వెలకట్టలేనివన్నారు. ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడంతో పాటు సంస్థను లాభాలబాటలో పయనింపజేయడంలో ఉద్యోగులు, సిబ్బంది సమన్వయంతో ముందుకు సాగుతున్నారని తెలిపారు. విధుల్లో మానసిక ఒత్తిడికి లోనవుతున్న వారికి ఇలాంటి కార్యక్రమాల ద్వారా కొంత ఉల్లాసం కలుగుతుందన్నారు. జీపీపీ ఆర్టీసీ డిపో సురేఖ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మీ పథకం ద్వారా ఆర్టీసీకి ప్రజాదరణ లభిస్తుందన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **టీఎస్‌యుటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ**



మద్దూరు(హుస్నాబాద్): మండలం కేంద్రంలో టీఎస్‌యుటీఎఫ్ 2024 క్యాలెండర్‌ను మండల నోడల్ అధికారి వరదరాజు, కాంప్లెక్స్ హెచ్‌ఎం చంద్రశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సంఘాలకతీతంగా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి టీఎస్‌యుటీఎఫ్ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రంగు రాజమల్లు, ప్రధాన కార్యదర్శి పిల్లి రాజు, ఉపాధ్యక్షుడు రాజేశం తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్: పీఆర్టీయూ గజ్వేల్ మండల అధ్యక్షుడు ఊడెం వేమారెడ్డి, ప్రధాన కార్యదర్శి లింగంగౌడ్ సంయుక్త ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం ఎంపీడీఓ మచ్చేందర్, ఎంఈఓ సునీత ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి వై.కృష్ణ, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు సుగుణాకర్, శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, శివశంకర్ పాల్గొన్నారు.

◆ **ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ క్యాలెండర్ ..**



సిద్దిపేట ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మంగళవారం ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణ కుమార్, జిల్లా ఇంటర్ విద్యాధికారి సూర్యప్రకాష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కూచంగారి శ్రీనివాస్ మాట్లాడుతూ కళాశాల నిర్వహణ నిధులు విడుదల కాకపోవడంతో ప్రిన్సిపాల్స్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఏటా క్రమం తప్పకుండా నిర్వహణ నిధులు సకాలంలో విడుదయ్యేలా చూడాలని కోరారు.

◆ **సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం**

గజ్వేల్‌రూరల్: బిల్కిస్‌బానో కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్లస్వామి పేర్కొన్నారు. మంగళవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుజరాత్ ప్రభుత్వం దోషులను విడుదల చేయడాన్ని వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, మేధావులు ఖండించారని, బిల్కిస్ బానో కేసులో 11 మంది దోషుల శిక్షా కాలాన్ని తగ్గిస్తూ గుజరాత్ ప్రభుత్వం తీసుకున్న చట్టవిరుద్ధమైన నిర్ణయాన్ని రద్దు చేస్తూ సుప్రీం కోర్టు తీర్పును ఇవ్వడం పట్ల న్యాయవ్యవస్థపై ప్రజలకు మరింత నమ్మకమేర్పడిందని, ఈ తీర్పు పట్ల మహిళాలోకం హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

◆ **ఉచిత వైద్య శిబిరం**

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని లింగుపల్లిలో సీఎస్‌సీ హెల్త్‌కేర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ బాల్ నర్సింహులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ **సెల్‌ఫోన్ అప్పగింత**

మద్దూరు(హుస్నాబాద్): పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ టెక్నాలజీతో పోలీసులు స్వాధీనం చేసుకొని బాధితుడికి మంగళవారం అందజేశారు. మద్దూరు ఎస్ఐ యూనుస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తహసీల్దార్ కార్యాలయంలో పనిచేసే బొల్లి యాదగిరి ఇటీవల తన ఫోన్ పోగొట్టుకున్నాడు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ టెక్నాలజీతో గుర్తించి ఫోన్ స్వాధీనం చేసుకొని బాధితుడికి అందజేశామన్నారు.

◆ **మ్యాట్ల పంపిణీ**

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని అల్వాలలో సర్పంచ్ ఎనగంటి కిష్టయ్య నేతృత్వంలో అంగన్‌వాడీ కేంద్రానికి మంగళవారం మ్యాట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేఖ, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

◆ **పాఠశాలను ఏర్పాటు చేయాలి**

బెజ్జంకి(సిద్దిపేట): హుస్నాబాద్ రెసిడెన్షియల్ పాఠశాలను మండలంలోని బేగంపేట పాఠశాలలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు జెడ్పీటీసీ కనగండ్ల కవిత తెలిపారు. మంగళవారం సిద్దిపేటలో జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో ఈ అంశం ప్రస్తావించానన్నారు. అలాగే ముంపునకు గురైన దాచారం శివారులోని 499 సర్వేనంబర్‌లోని బాధితులకు పరిహారమివ్వాలని కోరినట్లు చెప్పారు.